స్వాతి వారపత్రిక 'కథ కథ కథ కథ' పోటీలో 'ఇష్టమైన ఇతివృత్తం' అంశంలో బహుమతి పొందిన కథ

# పరబ్రహ్మ



ఉత్కంఠతో ఊగిపోతూ పచార్లు చేస్తున్నాను.

ఎడం చేతిలో సెల్‌ఫోను, ఎదురుగా 'మ్యూట్' మోడ్‌లో టీవీ... రెండింటి ముఖాల వంకా పదే పదే చూస్తున్నాను.

ఈ పాటికి ఐఐటి జీ ఫలితాలు ప్రకటించి వుంటారు. నా విద్యార్థులెందరు ర్యాంకులు సాధించారో వందలోపు ర్యాంకులు ఎన్ని వచ్చాయో ఎవరైనా చెబితే బావుణ్ణు!

నేను పనిచేస్తున్న కార్పోరేట్ కాలేజీవారు పరీక్షలయ్యేవరకూ సత్తా వున్న లెక్చరర్లని నెత్తిమీద పెట్టుకుంటారు. వారి కాలేజీలున్న వివిధ ప్రాంతాల్లో ఊరేగిస్తారు. కాని పరీక్షలయ్యాక వారిని పట్టించుకోరు. వారి పేరునీ కృషినీ బయటి లోకానికి తెలీనివ్వరు.

ర్యాంకులు రావడం ఆ కాలేజీ ఘనత తప్ప మరేం కాదని టీవీల్లో పేపర్లలో ఊదరగొడతారు. ర్యాంకర్ల ఫోటోలు ప్రచురించి వేలాదిమంది విద్యార్థుల్ని ఆకర్షిస్తారు.

అంతే తప్ప వారిని తీర్చిదిద్ది ర్యాంకర్లుగా తయారు చేసిన నాబోటి వాళ్ళకు 'ఇన్సెంటివ్స్' ఇస్తారు తప్ప 'గౌరవం' ఇవ్వరు. 'గుర్తింపు' రానివ్వరు. 'ఘనత'లో వాటా అస్సలివ్వరు.

సెల్ మోగింది. ఆన్ చేసి "హలో" అన్నాను ఉద్విగ్నుణ్ణై.

"నచికేతను సార్, నాకు ఆలిండియా థర్డ్ ర్యాంక్ వచ్చింది. ఈ క్రెడిట్ మీదే సార్. మీకు థాంక్స్ సార్" పరమానందంతో ఊగిపోతూ చెప్పాడు.

"హుర్రే! గ్రేట్! కంగ్రాట్స్ మై బోయ్. మొత్తం మనకెన్ని ర్యాంకులొచ్చాయి?"

"చాలా వచ్చాయి సార్. మమ్మల్నందర్నీ పొద్దుటే కార్పోరేట్ ఆఫీసుకి తీసుకొచ్చేశారు.. ఇప్పుడు ఛైర్మన్ గార్తో ఫోటో సెషన్ ఉందిట. ముందుగా మీకు చెప్పాలన్పించి బాత్‌రూంలోంచి చేస్తున్నాను సార్"

"మన విన్నర్సందరికీ నా అభినందనలు తెలియజెయ్యి" మహానందపు తేరు మీద షికార్లు చేస్తూ అన్నాను.

"ఈ సారీ మీ కాలేజీకి ర్యాంకుల పంట పండిందేవిటి" శ్రీమతి అంది.

"యాఁ. ఈసారీ గోల్డ్ కొట్టాం. నా శిష్యుడు నచికేతకు థర్డ్ ర్యాంక్ వచ్చింది. ఇంకా చాలా వచ్చాయిట్లే. ఇంకాస్సేపట్లో టీవీలో వస్తుంది......" మ్యూట్ నుంచి సౌండ్ మోడ్‌కి మారుస్తూ అన్నాను.

"మీ జీతం రెండు లక్షలు చేసేస్తారేమో" ఆశగా అంది.

నవ్వి ఊరుకున్నాను.

మా సంస్థలో టాపర్స్‌కి శిక్షణ ఇచ్చే టాప్‌మోస్ట్ లెక్చరర్లలో నేనొకడ్ని. మాథ్స్ లెక్చరర్ని గనుక మిగతా వారి కన్నా నా భుజాల మీదే బరువెక్కువ పడుతుంది. నా పాఠాలు హైదరాబాద్‌కే పరిమితం కాదు. బెంగళూరు, ఢిల్లీ, కోట, జైపూర్, చెన్నై వగైరా ప్రాంతాలకూ నన్ను మా యాజమాన్యం పంపిస్తూంటుంది.

టీవీలో మా సంస్థవారి యాడ్స్ ప్రత్యక్షమయ్యాయి. 3,4,5,6,7.....ఇలా వరుసగా ఎన్నో ర్యాంకులు మావేనంటూ!

మా ఫోటోలూ చూపిస్తూ మాకూ క్రెడిట్ ఇస్తే మాకూ ఉత్తేజంగా ఉండేది. కాని చెయ్యరు. వారిది వ్యాపార సంస్కృతి!

నిట్టూర్చాను.

నా వంక చిత్రంగా చూసింది శ్రీమతి.

"మా వల్ల ర్యాంకులొచ్చాయి. కాని మమ్మల్ని గుర్తించడం లేదు చూడు" అక్కసుగా అన్నాను.

"పెద్ద మొత్తంలో జీతాలిస్తున్నారుగా"

"ఇస్తే సరిపోతుందా?"

"మీకూ వారికీ మధ్య అమ్మకం కొనుగోలు తప్ప ఇంకేమైనా ఉందంటారా?"

అయోమయంగా చూశాను. ఆమె భావం అర్థంకాలేదు. అలాగని రెట్టించదలచలేదు.

"మొన్ననే 55వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఇకనైనా వ్యాపార విద్యకి స్వస్తి చెప్పి అందరికీ ఉపయోగపడేట్టు మీ విజ్ఞానాన్ని ఉపయోగించొచ్చుగా"

ఆమె మాట వినబడనట్టుగా ఉండిపోయాను.

సెల్ మోగింది.

"హలో సూరిబాబుగారేనా? నమస్కారం. నేను కృష్ణశాస్త్రిని. నర్సాపురం నుండి మాట్లాడుతున్నాను......"

"చెప్పండి......"

"మన మిషన్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సమావేశం ఏర్పాటు చేశాం. మీరూ పూర్వ విద్యార్థే గనుక ఎలాగైనా తీరిక చేసుకుని రావాలి. ఒక సెలబ్రిటీగా అటెండవ్వాల్సిందిగా కోరుతున్నాను......"

అమాంతం నా మనస్సంద్రం ఆకాశమెత్తు ఎగిరింది.

"ఇంకా చాలా మంది చాలా రంగాల్లో ఖ్యాతిగాంచిన వాళ్ళున్నారుగా....." మొహ మాటానికన్నాను.

"ఎందరున్నా సరే మీరు సెలబ్రిటీయే. మీరు మామూలు లెక్చరర్ కాదు. ఐఏటీయన్లను సృష్టిస్తున్న మహోపన్యాసకులు. మీరొస్తున్నారని ఇన్విటేషన్లు ప్రింటు చేస్తాం. మీరు కాదనకూడదు"

"మీరంత అభిమానంతో పిలుస్తోంటే నేనెందుక్కాదంటాను. అలాగే కానివ్వండి"

సెల్ కట్టేస్తూనే "నేను సెలబ్రిటీనయ్యానోయ్. నేను పుట్టిన గడ్డమీద జరగబోయే సభకి గెస్ట్‌గా వెళ్తున్నాను" పొంగిపోతూ అన్నాను శ్రీమతికి విన్పించేలా బిగ్గరగా.

"సన్మానం కూడా చేస్తారేమో" లోపల్నుంచొస్తూ అంది.

"చెయ్యొద్దు మరీ. నా గురించి పేపర్లవాళ్ళూ ప్రముఖంగా రాస్తారు" సంబరంగా అన్నాను. నా భుజాలు రెండు కాదు మూడంగుళాలు పెరిగాయ్.

* * *

నర్సాపురం మా స్వస్థలం. అమ్మా నాన్నా లేరుగాని అన్నయ్య, అక్కయ్య, ఇతర బంధువులూ అక్కడే ఉన్నారు.

స్కూలు ఫంక్షన్‌కి నేనొచ్చానని తెలుసుకుని అన్నయ్య ఆశ్చర్యబోయాడు. బంధువులిళ్ళల్లోని పెళ్ళిళ్ళకీ పబ్బాలకీ ఎప్పుడో తప్ప హాజరవను. నాకంత తీరిక వుండదు మరి. ఆ సంగతి చెప్పినా వాళ్ళకి అర్థం కాదు.

ఒకరోజు ముందుగానే వచ్చాను గనుక క్లాస్‌మేట్స్ ఎవరైనా కలుస్తారేమోనని మిషన్ హైస్కూలుకెళ్ళాను.

ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు నేనీ స్కూల్లోనే చదివాను. ఆ ప్రక్కనున్న గ్రౌండులోనే ఆడుకున్నాను. అప్పట్లోనే చిన్న సైన్స్ ల్యాబ్ ఉండేది. మధ్య హాలులో జరిగే బైబిల్ క్లాసుల్ని స్వయంగా హెడ్మాస్టారే తీసుకునేవారు. బ్యాండ్ మ్రోగుతోంటే అంతా లైనుగా వెళ్ళి ప్రేయర్లో పాల్గోవటం భలే సరదాగా ఉండేది.

స్కూలు అలాగే ఉంది. పరిసరాలు మాత్రం గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి.

ఆ రోజుల్ని నెమరేసుకుంటూ లోపలికెళ్లాను. మా సమావేశానికి సంబంధించిన ఫ్లెక్సీ కనిపించగా అటుకేసి నడిచాను. కొందరు పెద్దవాళ్ళు దేని గురించో చర్చించు కుంటున్నారు.

నేవెళ్ళి పరిచయం చేసుకున్నాను.

కృష్ణశాస్త్రి నా చెయ్యి పట్టుకుని ఊపేశాడు. "మీరొచ్చారు. నాకు చాలా హ్యాపీగా ఉంది. ప్రిన్సిపాల్‌గార్తో మాట్లాడతాను. టెన్త్‌వాళ్ళకి నాలుగు ముక్కలు చెబుదురుగాని. ఇన్స్‌పైర్ అవుతారు"

"చూద్దాంలెండిగాని దేని గురించీ డిస్కస్ చేస్తున్నారు...." అడిగాను.

"రేపటి మన మీట్‌లో రిటైర్డ్ టీచర్స్ అందర్నీ సన్మానించడమా లేక ఆచార్యులు మాస్టారొక్కర్నీ సన్మానించడమా అని తర్జన భర్జన పడుతున్నాం"

"ఆచార్యులు మాస్టారంటే...."

"లెక్కల టీచర్.....అప్పట్లో వీటీ గారనే వాళ్ళమే ఆ తిరువెంగళాచార్యులు గారు..."

"ఆయనింకా బతికే ఉన్నారా?"

అంతా వింతగా చూసేసరికి నాలిక్కరుచుకున్నాను. "ఆయనిక్కడే ఉంటున్నారన్న మాట....."

"వూఁ. దగ్గర దగ్గర ఎనభై ఏళ్ళుంటాయి. కర్రసాయంతో చకచకా నడుస్తూంటారు. వారానికోసారైనా స్కూలుని చూసి వెళ్తూంటారు"

'అలాగా' అన్నట్టు తల పంకించాను గాని నాకు చాలా ఇబ్బందిగా వుంది. ఎంబ్రాస్సింగా వుంది. అనవసరంగా వచ్చానేమోనని మనసు పీకసాగింది.

"అలా అయిపోయారేంటి?" ఒకరడిగారు.

"అహ ఏంలేదు..... మిగతా వారి సంగతెలా వున్నా మాస్టార్ని సన్మానించాల్సిందే. వయస్సుని బట్టి అయినా గౌరవించాల్సిందే......" అనేశాను - అయిష్టంగానే.

"సూరిబాబుగారు చెప్పినట్టు ఆయనొక్కరికీ చేసేద్దాం. వీరూ నేనూ ఇప్పుడే వెళ్ళి ఆహ్వానించొస్తాం" అన్నాడు కృష్ణశాస్త్రి.

"నాకు వేరే పనుంది......మీరెళ్ళి రండి....వస్తానూ...." పరుగులాంటి నడకతో అక్కణ్నుంచి దూరంగా వచ్చేశాక గాని గుండెలు కుదుట పడలేదు.

ఆచార్యులు మాస్టారు నన్ను చూస్తూనే గుర్తు పట్టడమేకాదు అందర్లో పట్టుకుని 'ఓరి బడుద్ధాయీ' అంటారు. అంతా ఘొల్లుమని నవ్వుతారు. ఎంత అవమానం!

మనస్సు చేదుగా అయ్యింది. నా కర్మగాకపోతే ఆయనింకా బతికుండటం ఏవిటీ!

అన్నయ్యింటికెళ్ళాను. అన్యమనస్కంగా స్నానం చేసి భోంచేశాను. ఇంటికబుర్లు చెప్పడానికుద్యుక్తుడవుతున్నాడు అన్నయ్య. నిద్రొస్తోందని చెప్పి వెళ్ళి పడుకున్నాను.

ఆచార్యులు మాస్టారి రూపం మాత్రం నన్ను వెంటాడటం మానలేదు. పాత సంగతులు కళ్ళముందుకు తోసుకొచ్చాయి.

నాకు లెక్కలంటే చచ్చేంత భయం. ఏడో తరగతి దాకా అత్తెసరు మార్కుల్తో ఏదో రకంగా లాగించుకొచ్చాను. ఎనిమిదో క్లాసులో నా పప్పులు ఉడకలేదు.

ఆచార్యులు మాస్టారు ఎనిమిది, తొమ్మిది, పదో తరగతులకు లెక్కలు చెప్పేవారు. ఎనిమిదిలోకెళ్ళిన నాలుగో రోజునే నా మీదాయనకి అనుమానం వచ్చేసింది.

"ఒరే బడుద్ధాయీ! తొమ్మిదో ఎక్కం అప్పజెప్పరా" అన్నారు.

నా గుండెలు గుభిల్లుమన్నాయి. తొట్రుపడుతూ దిక్కులు చూస్తూ నోటికొచ్చినట్లు చెప్పేను. నా చెవులు మెలిపెట్టి బెంచీ ఎక్కించారు. మర్నాటికి ఏడు, తొమ్మిది, పదమూడు ఎక్కాలు బట్టీ పట్టి రమ్మన్నారు.

తలాడించానుగాని ఆ తర్వాత వరుసగా నాలుగురోజులు డుమ్మా కొట్టేశాను.

అయిదో రోజున మధ్య బెంచీలో పొడుగ్గా వుండే సుదర్శనంగాడి వెనక నక్కి కూర్చున్నాను. అయినా మాస్టారి డేగ కళ్ళు నన్ను పట్టేశాయి.

"ఒరే బడుద్ధాయీ! అలా దాక్కుంటావేంట్రా. ఇలా ముందుకి రా"

తిట్టుకుంటూనే ముందు బెంచీకి మారాను.

"ఎక్కాలొచ్చాయా?"

తలాడించాను.

"ఏడో ఎక్కం వెనక నుంచి అప్పగించు......."

గుటకలు మింగాను. నా అదృష్టం కొద్దీ అప్పుడే ఏదో నోటీసు వచ్చింది. నా గొడవ మర్చిపోయారు. అదయ్యేసరికి బెల్ మోగింది. 'హమ్మయ్య' అనుకున్నాను.

మిగతా అన్ని సబ్జక్టుల్లో మంచి మార్కులే వచ్చేవి. కాని లెక్కలు కొరుకుడు పడేవి కావు. పైగా ఎత్తుగా బలంగా గంభీరంగా వుండే ఆచార్యులు మాస్టారి రూపమే భీతిగొల్పేది.

ఇహ ఆయన మాట చెమటలు పట్టించేది. ఎప్పుడూ తెల్లని దుస్తులు ధరించి ఎర్రగా రాగి వర్ణంతో మెరిసిపోయేవారు.

ఆయన నుదుటి నామాలు మాత్రం ఏదో తెలీని అభయాన్నిచ్చేవి. మా మిషన్ హైస్కూల్లో నామాలు ధరించి వచ్చే ఉపాధ్యాయుడు ఆయనొక్కరే.

ఆయనకి భయపడి హోం వర్కు లెక్కలు మిత్రుల పుస్తకాల్లోంచి కాపీ కొట్టేవాడిని. అది నేనే చేశాననుకుని "దారిలో పడుతున్నావ్. ఇంకా శ్రద్ధగా చెయ్యి" అనేవారు.

అర్థ సంవత్సర పరీక్షలొచ్చాయి. ఆల్జీబ్రా అంటే గుండె గాబరాగా వుండేది. అందుకని సూత్రాలని చిన్న స్లిప్ మీద రాసుకుని పరీక్షకు పట్టుకెళ్ళాను. పరీక్షల్లో అవే వచ్చాయి. పైగా నాది కార్నర్ సీటు.

ఇన్విజిలేటర్ కళ్ళుగప్పి ఆన్సర్ పేపర్ల క్రింద కాపీ పెట్టుకుని గబగబ రాసేస్తోంటే మా రూంలోకి ఆచార్యులు మాస్టారొచ్చారు. నేను గమనించలేదు. దీక్షగా కాపీ కొడుతున్నాను.

మాస్టారు నా దగ్గరికొచ్చి లేవమన్నారు. లేచానుగాని కంగార్లో కాపీ స్లిప్ క్రింద పడింది. దాన్నీ నన్నూ తీక్షణంగా చూశారు. సన్నగా వణికాను. ఆన్సర్ పేపర్ లాక్కుని చూశారు.

మరుక్షణం నా తల వంచి వీపు మీద దబదబ బాదేశారు. కళ్ళు బైర్లు కమ్మాయ్.

"ఇంకొక్కసారిలా కాపీ కొట్టడం చూశానో ఒళ్ళు చీరేస్తాను. లెక్కలు చేస్తే వస్తాయిరా బడుద్దాయ్. ఊరికే చూస్తూ కూర్చుంటే ఏమీ రావు. వాటి అంతు నువ్వు చూడాలిగాని నీ అంతు వాటిని చూడనివ్వకూడదురా బడుద్దాయ్. ఇంక ఏడు. బుర్రలో వున్నదాన్ని పేపర్ మీద పెట్టు. కూర్చో" గద్దిస్తూ అన్నారు.

అదిగో అందర్లో కొట్టి తిట్టిన ఆ క్షణం నుంచే ఆచార్యులు మాస్టారంటే నాకు పీకలదాకా కసి, ద్వేషం పుట్టుకొచ్చాయి. ఆ అవమానం భరించడం నా తరం కాలేదు. ఆ రోజు సాయంత్రం మాస్టారెళ్ళే దారిలో కాపు కాశాను.

చీకటి పడుతూండగా మాస్టారు సైకిల్ మీద వస్తూ కన్పించారు. చెట్టు చాటు నుంచి ఇంత రాయి ఆయన మీదకి విసిరేసి పారిపోయాను.

'అమ్మా' అని అరవడమూ సైకిల్ పడిపోయిన శబ్దమూ విన్పించాయి. మరి రెండ్రోజుల దాకా నేను స్కూలు ముఖం చూడలేదు.

"ఆచార్యుల మాస్టారొస్తున్నారా?" నా క్లాస్‌మేట్ అప్పల్రాజునడిగాను.

"వస్తున్నార్రా. నువ్వు స్కూలుకి రావటం లేదేం? ఎవరో మాస్టార్ని కొట్టారంట. తలకి కట్టు కట్టుకునొస్తున్నారు......" కించిత్తు అనుమానంగా చూస్తూ అన్నాడు.

తేలుకుట్టిన దొంగలా ఉండిపోయాను.

మాస్టారి ముందుకెళ్ళడానికి ధైర్యం చాలక ఎలావోలా ఆయన క్లాసులోంచి జారిపోయేవాడ్ని.

ఓసారి హెడ్మాస్టారు అజరయ్యగారు నన్ను పట్టుకున్నారు. గద్దించి నిలదీసే సరికి ఏడుస్తూ నాకు లెక్కలు రావనీ ఆచార్యులు మాస్టారంటే భయమనీ చెప్పాను.

ఆయన మాస్టార్ని పిలిచి సంగతి చెప్పేరు.

"ఒరే బడుద్దాయీ! నేనంటే భయపడు. లెక్కలకు మాత్రం భయపడకు. ఓసారి మీ నాన్నని తీసుకురా మాట్లాడతాను" అన్నారు.

నా 'పెళ్లి' అయిపోవడం ఖాయమనిపించింది. ఇంటికెళ్ళి ఇక ఆ స్కూలుకి వెళ్ళనని గొడవచేశాను.

"అది మనూళ్ళోకెల్ల మంచి స్కూలురా. చుట్టు పక్కలి ఊళ్ళ నుంచి కూడా వస్తూం టారు తెలుసా" అని నాన్న ఎంత చెప్పినా విన్పించుకోలేదు. నా పంతం వదల్లేదు.

"నేనొచ్చి మీ లెక్కల మాస్టారుతో మాట్లాడుతాన్లేరా" అన్నారు నాన్న.

"వద్దొద్దు. అది మనస్సులో పెట్టుకుని నన్ను ఫెయిల్ చేసేస్తారు" ఏడ్చేశాను.

"పిల్లాడు బాగా బెదిరాడురా. ఆయనకేమైనా 'నేమాను' ఇవ్వరా అబ్బాయ్ చక్కగా చూసుకుంటాడు. ఇది వరకు దసరాకి అంతో ఇంతో ముట్టజెప్పేవాళ్ళం గనుక శ్రద్ధగా చదువు చెప్పేవారు. ఇప్పుడవేమీ లేవు కదా!" అంది నానమ్మ.

"ఆయనదగ్గరకి ప్రైవేటుకెళ్ళటం లేదని ఆయనకి కోపమేమో" అంది అమ్మ.

"ఆయన ప్రైవేట్లు చెప్పరు"

నా పంక అదోలా చూసి, "సరే. ఆయన్ని మంచి చేసుకునే పని మాకొదిలెయ్. ఇక ఆయన నిన్నేమీ అనకుండా చూస్తాను. సరేనా?" అన్నాడు నాన్న.

సందేహిస్తూనే తలాడించాను.

ఆదివారం నాడు అయిదు రకాల పండ్లబుట్టలతో మా నాన్నా నేనూ ఆచార్యులు మాస్టారింటికెళ్ళాం.

నేను, నాన్న వెనక దాక్కున్నాను. నాన్న ముందు నన్ను 'ఒరే బడుద్దాయ్' అంటే తల కొట్టేసినట్టుంటుందని!

'ఇవన్నీ ఏమిటి?" పండ్ల బుట్టల్ని చూపిస్తూ అడిగారు మాస్టారు.

"వీడు మీ శిష్యుడండి. ఏదో మా తృప్తికోసం......."

"ముందు వాటిని బయట పెట్టి మాట్లాడండి......"

"అది కాదండి......."

"గుడికి పూలూ పళ్ళూ పట్టుకెళ్ళండి. కోరికలుంటాయి గనుక. గురువు దగ్గరికి మాత్రం జ్ఞానార్థియై వెళ్ళాలి జ్ఞాన తృష్ణతో వెళ్ళాలి తప్ప పూలూ పళ్ళతో కాదు" అన్నారు మాస్టారు.

వారబ్బాయి మాత్రం ఎంతో నిరాశపడి బిక్కమొహం పెట్టేడు.

ఆయన మొండి ఘటమని అర్థమవడంతో బుట్టల్ని గడప అవతల పెట్టి లోపలి కెళ్ళాం.

"కూర్చోండి. మిమ్మల్ని తీసుకురమ్మని వీడికి నేనే చెప్పేను. ఎంచేతో వీడు లెక్కల మీద శ్రద్ధ పెట్టడం లేదు. తెలివైన వాడే గాని దగ్గరి దార్లు వెదుకుతున్నాడు. గైడ్లు వచ్చి వీళ్ళని కొంత పాడుజేస్తున్నాయి......"

"మీరే వాడ్ని దారిలో పెట్టాలి. ప్రైవేటుకి పంపించమంటే పంపిస్తానండి. ఫీజు ఎంతైనా ఫరవాలేదు....." వినయంగా చెప్పాడు నాన్న.

"ఏరా. లెక్కలు క్షుణ్ణంగా నేర్చుకోవాలన్న పట్టుదల ఉందా?" అడిగారు మాస్టారు.

ఉందన్నట్టు తలాడించాను.

"అది చాలు. అదే నా ఫీజు. వేసవి శలవుల్లో రోజూ ఉదయం ఆరింటి నుంచి పదింటి దాకా మా ఇంట్లోనే ఉంటాడు....." మాస్టారన్నారు.

"సెలవుల్లో అమ్మమ్మవారి ఊరుకి తీసుకెళ్తానన్నారుగా నాన్నా" వెంటనే వారబ్బాయి అన్నాడు.

"చదువు తర్వాతే అవన్నీ"

వాడు నా వంక గుర్రుగా చూశాడు.

చేతులు జోడించి వచ్చేశాం. నాకు మాత్రం బెంగపట్టుకుంది. పెణం మీంచి పొయ్యిలోకి దూకినట్టుంది.

వేసవి సెలవులివ్వగానే పుస్తకమూ పెన్నూ పట్టుకుని వెళ్ళాను.

రామానుజన్ గురించి చెప్పుకొచ్చారు మాస్టారు. అతడు 'గణిత మహర్షి' అని అభివర్ణించారు. చిన్న వయస్సులో ఆరోగ్యం అంతగా సహకరించకపోయినా గణితంలో అద్భుతాలు సృష్టించి ప్రపంచానికి భారతదేశపు మేధావితనాన్ని చాటారు–అన్నారు.

లెక్కలు చెప్పకుండా ఈ సోది ఎందుకో అర్థంకాలేదు.

రెండో రోజూ ఆయన గురించి పిట్ట కథలు చెప్పారు. నాన్న ముందు గొప్పలకుపోయారు తప్ప లెక్కలు చెప్పరనీ పూరికే కాలక్షేపం చేస్తారనీ అనుకున్నాను.

మూడోరోజున వెళ్ళనని భీష్మిస్తే నాన్న బలవంతాన సైకిల్ మీద తీసుకెళ్ళి వదలి పెట్టారు.

నా పుస్తకం తీసుకుని గళ్ళు గీసి ఇలా అంకెల్తో నింపారు మాస్టారు.

| | | | |
|---|---|---|---|
| 22 | 12 | 18 | 87 |
| 88 | 17 | 9 | 25 |
| 10 | 24 | 89 | 16 |
| 19 | 86 | 23 | 11 |

"దీన్ని రామానుజన్ మ్యాజిక్ స్క్వేర్ అంటారు. ఇది ఆయన సృష్టించిన ఓ అద్భుతం. ప్రతి గడినీ నిలువుగా టోటల్ చెయ్యి 139 వస్తుంది. అడ్డంగా చెయ్యి 139 వస్తుంది. అయిమూలగా కూడినా 139 వస్తుంది. మూలల్లోని అంకెలు అంటే 12+88+16+23 కూడినా, 18+25+10+86 కూడినా 139 వస్తుంది. మొదటి గడిలోని మధ్యలోని రెండు (12+18) నాలుగో లైనులోని మధ్యలోని రెండు (86+23) కలిపినా అంతే వస్తుంది. మొదటి నిలువు లైను మధ్యలోని 88+10 కి నాలుగో నిలువులైను మధ్యలోని 25+16 కలిపినా 139 వస్తుంది. నాలుగు మూలల్లోని కార్నర్ ఫిగర్స్ 22+87+19+11 కలిపినా 139 వస్తుంది. ఈ స్క్వేర్‌ని నాలుగు స్క్వేర్‌లుగా విభజించి ఒక్కో స్క్వేర్‌లోని నాలుగు అంకెల్ని టోటల్ చేసినా అంతే వస్తుంది. రెండు మూడు అడ్డపు లైన్లని రెండు

స్క్వేర్‌లు చేసి (88+17+10+24 మరియు 9+25+89+16) కూడినా 139 వస్తుంది. మధ్యలోని 17+9+24+89 కూడినా అంతే. ఇంకో చిత్రం చెప్పనా. రామానుజన్ పుట్టిన తేదీ 22.12.1887. అంటే మొదటి వరుసలోని అంకెలన్నమాట!"

అప్రయత్నంగా తప్పట్లు కొట్టాను.

మాస్టారి కళ్ళల్లో మెరుపు మెరిసింది.

ఇంటికెళ్ళేక దాన్ని బాగా స్టడీ చేశాను. అలాంటిది తయారు చెయ్యాలని అవాళా ఆ రాత్రీ ఎన్నో గళ్ళు గీసి ఎన్నో అంకెలు మార్చి మార్చి చూశాను గాని నాకు సాధ్యం కాలేదు. కాని గణితమంటే ఆసక్తి ఏర్పడింది. నేనూ ఏదో సాధించాలన్న ఆకాంక్ష వేరూనింది.

"గణితం ఓ మహిమాన్విత శాస్త్రం. లోలోపలికెళ్ళే కొద్దీ ఇంకెన్నో ఎన్నో రహస్యాలూ ఆవిష్కరణలూ బయటపడతాయి. అంకెల్లోని 'సున్న'ని కనుక్కున్నది మన ఆర్యభట్టే. లెక్కల మీదే మిగతా అన్ని శాస్త్రాలూ ఆధారపడి వున్నాయి. నువ్వు చెయ్యవలసిందల్లా మనస్సుని అంకెల మీద లగ్నం చెయ్యడమే. రేపు పదిహేనో ఎక్కందాకా చదువుకునిరా"

మాస్టారి మాట నాకు వేదాజ్ఞ అయ్యింది. ఇంటికొచ్చి బస్కీ పెట్టుకూర్చుని గణగణ చదివాను. మర్నాడు ముందు నుంచి వెనుక నుంచి గడగడ అప్పజెప్పేను.

"సెభాష్‌రా బడుద్దాయీ" అని భుజం తట్టారు.

ఆల్జీబ్రా మొదలు పెట్టారు $(a + b)^2 = a^2 + 2ab + b^2$ ఎలా అయ్యిందో గుణించి చెప్పేరు. ఒక్కో సూత్రం వివరించి చెప్పారు. పదే పదే ప్రాక్టీసు చేశాను.

సెలవులయ్యేసరికి 'ఓస్ లెక్కలు! ఊది పారెయ్యగలను' అన్న ధీమా ఏర్పడింది.

లెక్కలమీద జిజ్ఞాస పెరిగింది. పై క్లాసు పుస్తకాలు తీసుకుని లెక్కల్ని దున్నెయ్య సాగాను.

టెన్త్ పబ్లిక్ పరీక్షలో నూటికి నూరు మార్కులు తెచ్చుకున్నాను.

శ్రీ వై ఎస్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరి ఎంపీసీ గ్రూపు తీసుకున్నాను. ఓసారి ఆచార్యులు మాస్టారు నన్ను వెదుక్కుంటూ కాలేజీకి వచ్చి శకుంతలాదేవి పుస్తకం ఇచ్చారు. అది నన్ను మరింత ఆకర్షించింది. 'నా లోతు కనుక్కోవోయ్' అని లెక్కలు నన్ను సవాల్ చేస్తున్నట్టనిపించింది. ఆ సవాల్‌ని మనస్ఫూర్తిగా స్వీకరించాను.

యమ్మెస్సీ మ్యాథ్స్‌లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ అందుకున్నాను. ఆ తర్వాత డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నాను. అయినా నా దాహం తీరక ఎన్నెన్నో పుస్తకాలు చదివాను. టెక్స్ట్ బుక్స్ రాశాను. కార్పోరేట్ కాలేజీ వాళ్ళు పిలుచుకెళ్ళారు.

నా తృష్ణకు బ్రేక్ పడింది. విద్యార్థుల్ని ఐఐటీజీ ఉత్తీర్ణులని చెయ్యడమే నా ఏకైక లక్ష్యమయ్యింది. అందులోనూ విజయ పరంపర కొనసాగిస్తున్నాను. కానేదో అసంతృప్తి! అశాంతి!

అందుక్కారణాలేమిటో తెలుసుకోవాలని తపిస్తూనే విశ్లేషించుకుంటూనే నిద్ర పోయాను.

మర్నాడు మిషన్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశానికెళ్ళాను. అపూర్వంగా రిసీవ్ చేసుకున్నారు. కొందర్ని గుర్తు పట్టాను. మరికొందరు వాళ్ళే వచ్చి ఫలానా అని పరిచయం చేసుకున్నారు.

ఎన్నో కబుర్లు ముచ్చట్లు జ్ఞాపకాలు నాటి స్నేహాలు సరదాలు జీవితంలోని విజయాలు ఉద్యోగంలో ఎక్కిన మెట్లు – అందరం కలిసి కలబోసుకున్నాం.

సాయంత్రపు బహిరంగ సభకి హెడ్మాస్టారు అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులే కాదు ప్రస్తుత విద్యార్థులూ టీచర్లూ పేరెంట్సూ స్థానిక ప్రజలూ కూడా హాజరయ్యారు.

కార్యక్రమంలోని భాగంగా ఆచార్యులు మాస్టారిని వేదిక మీదకి సవినయంగా తీసుకొచ్చారు. వేదిక మీదే వున్న నేను లేచి నిలబడి చేతులు జోడించాను.

నన్ను దాటబోతూ ఆగి, "ఏరా బడుద్దాయీ" అంటూ నా భుజాలు తట్టి ముందుకెళ్ళారు. నా మొహం ఎర్రబడింది. నన్ను గుర్తు పట్టరనుకున్నాను. నా అంచనా తప్పయ్యింది. ఆయన దేవాంతకుడు.

ఎప్పుడో నా చిన్నప్పుడు నాలుగు పాఠాలు చెప్పి లెక్కల మీద ఆసక్తి కలిగించిన మాట నిజమే. అలాగని దేశస్థాయిలోనే గర్వించదగిన మేథ్స్ లెక్చరర్‌గా ఎదిగిన నన్ను పట్టుకుని బడుద్దాయనడం ఆయన కుసంస్కారం అన్పించింది.

'నా గురించి పాపం తెలీదులే' అని సరిపెట్టుకోజూశాను గాని సాధ్యం కాలేదు. నేనాయన్ని మించిన గణిత గురువునైనందుకు అసూయపడుతున్నారనుకునే సరికి మనస్సు కాస్తంత కుదుట పడింది. శాంతించింది.

ఓ వక్త ఆచార్యులు మాస్టారు గురించి గొప్పగా మాట్లాడారు. లెక్కల్లో దిట్ట అన్నారు. ఆ స్కూలు విద్యార్థులు గొప్ప గొప్ప ఇంజినీర్లు అయ్యారంటే అందుక్కారకులు మాస్టారే అన్నారు. ఆయన వేసిన పునాదుల మీద మహాసౌధాలు నిర్మించుకున్నారన్నారు. ఎక్కడ అంకెలు కన్పించినా ఆచార్యులు మాస్టారికి నమస్కరించాలని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు.

ముళ్ళ మీద కూర్చున్నట్టు కూర్చున్నాను. నా ముందు పిపీలికంలాంటి మాస్టార్ని ఆకాశానికెత్తెయ్యడం భరించరానిదిగా ఉంది. వారిది అమాయకత్వమో మూఢత్వమో తెలీడం లేదు. నా మనస్సు మాత్రం కుతకుత ఉడికిపోతోంది.

మాస్టార్ని సన్మానించడానికి పట్టుశాలువా, గులాబీపూల దండ, సన్మాన పత్రంతో స్టేజిమీదకొచ్చారు పూర్వ విద్యార్థులు.

"దయచేసి ఆగండి. నేను రెండు ముక్కలు మాట్లాడాలి" అన్నారు మాస్టారు కర్ర సాయంతో నిలబడి.

అంతా ఎక్కడివారక్కడే నిలబడి పోయారు.

"పెద్దలు 'ఆచార్య దేవో భవ' అన్నారు. 'గురుర్బ్రహ్మ' అన్నారు. 'గురు సాక్షాత్ పరబ్రహ్మ' అనీ అన్నారు. అంచేత గురువుని శిష్యులు సన్మానించడంలో విశేషం లేదు. గురువు శిష్యుడ్ని సత్కరించడంలో అర్థం, పరమార్థం, బాధ్యత సక్రమంగా నిర్వర్తించామనే తృప్తి, సంతోషం ఉన్నాయి. ఇప్పుడు నేనా పని చెయ్యబోతున్నాను దయచేసి అనుమతించాల్సిందిగా సభాధ్యక్షులవారిని కోరుతున్నాను"

సభ విస్తుబోయింది. నాతో సహా అందరం ఆ భాగ్యశాలి ఎవరా అని సభలోకి కలయజూశాం.

మాస్టారు తన చేతి సంచిలోంచి ఖద్దరు శాలువా బంతిపూల దండ బయటికి తీశారు. అంతా ఉగ్గబట్టి చూస్తున్నాం.

ఆయన మెల్లగా అడుగులేస్తూ వచ్చి నాకు శాలువా కప్పి నా మెడలో పూలదండ వేశారు. మ్రాన్పడిపోయాను.

తప్పట్ల వర్షం కురిసింది.

"ఈ బడుద్దాయి నా శిష్యుడు. ఇప్పుడు డాక్టర్ సూరిబాబు అనబడే వీడు గొప్ప గణితోపన్యాసకుడు. నా మనవడు నచికేత యొక్క గురువు. వీడు ఐఐటి ప్రవేశ పరీక్షకి హాజరయ్యేవారి కోసం రాసిన లెక్కల పుస్తకం చూశాను. అందులో వీడి కాలేజీ పేరు తప్ప వీడి పేరు వెయ్యలేదు.

అయినా వీడి ముద్ర, వీడి శైలి, వీడి విశ్లేషణ పట్టిస్తుంది. ఐఐటీయన్ కావాలనుకునే వారికది కరదీపిక అని బల్ల గుద్ది చెప్పగలను. వీడు సామాన్యుడు కాదు. అద్భుత మేధావి. గొప్ప గణిత శాస్త్రవేత్త. ఇలాటివాడు నా శిష్యుడైనందుకు నిజంగా నా జన్మ తరించినట్టుగా ఉంది.

ఇంతటి మేధావీ కార్పోరేట్ ధన వ్యామోహ శ్లేష్మంలో పడి కొట్టుకుంటున్నాడు. అందులోంచి బయటపడాలి. అశాశ్వత విలువల్నుంచి శాశ్వత విలువల్లోకి ప్రయాణించాలి. అంకెకి ముందున్న సున్నాలా గాక అంకె తర్వాతి సున్నాగా మారాలి. గణిత శాస్త్రాన్ని మరింతగా మథించి మరిన్ని నూతనావిష్కరణలకి సృష్టికర్తవ్వాలని, మరో రామానుజన్ అన్పించుకోవాలని నా ఆశ ! ఆకాంక్ష !!"

ఆ క్షణాన 'గు' అంటే చీకటి 'రు' అంటే తొలగించడం అని బోధ పడింది.

నా అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తూ దిశానిర్దేశం చేసిన ఆ మహాగురువు ముందు మోకరిల్లాను.

**(స్వాతి నవరి వారపత్రిక 11.4.2014)**